

సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, పక్కన మండలి చైర్మన్ గుత్తా

సీపీఏ సమావేశానికి స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ధర్మశాలలో జరుగుతున్న వార్షిక కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్(సీపీఏ) ఇండియా రీజియన్, జోనల్-2 సమావేశానికి సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. ఆయనతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ లెజిస్లేటివ్ సెక్రటరీ డా.వి.నరసింహాచార్యులు, అధికారుల బృందం పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జూలై మాసంలో నిర్వహించనున్న ప్రత్యేక ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ రవాణాకు గురవుతున్న, తప్పిపోయిన పిల్లలను గుర్తించే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. బాల కార్మికుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడమే కాకుండా వారికి ఉపాధి అవకాశాల నిమిత్తం వృత్తి కోర్సులలో శిక్షణ ఇప్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, డీడబ్ల్యూవో కృష్ణవేణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యానాయక్, అడిషనల్ ఎస్పీ మురళీధర్, డీసీపీఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం 185 దరఖాస్తులు..

ప్రజావాణికి వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 185 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఫిర్యాదును పరిశీలించి పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. అలాగే ఫిర్యాదులపై చేపట్టిన చర్యల వివరాలను వెనువెంటనే వారికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పని చేసినోళ్లకే పదవులు

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలి
డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

7



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉపాధ్యాయులకు తీపి కబురు చెప్పింది. ఎట్టకేలకు వారి వేతనాలకు నిధులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాకు మొత్తంగా రూ. 8.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. నేడో, రేపో వారు నాలుగు నెలల వేతనం అందుకోనున్నారు. ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 201 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు న్నారు.

కాంట్రాక్ట్ టీచర్లకు తీపి కబురు

వేతనాలకు రూ. 8.40 కోట్లు మంజూరు

- ఉమ్మడి జిల్లాలో 201 మందికి లబ్ధి
- ఒకేసారి అందుకోనున్న నాలుగు నెలల వేతనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు
- ఫిబ్రవరి 14వ తేదీన నియామకం

నెలనెలా వేతనాలు చెల్లించాలి



ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్టు ఉపాధ్యాయులకూ నెలనెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలి. వేతనంపైనే ఆధారపడే వారికి వేతనాలు పెండింగ్‌లో ఉంచకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సకాలంలో వేతనాలు అందేలా అధికారులు సైతం చర్యలు తీసుకోవాలి. పెండింగ్ వేతనాలు విడుదల చేయడం పట్ల పీఆర్‌టీయూ టీఎస్ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

-కె.చంద్రశేఖర్, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు



కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, నిధుల కేటాయింపు వివరాలు

జిల్లా	కాంట్రాక్ట్ టీచర్లు	నిధులు
వికారాబాద్	90	రూ.3.76కోట్లు
రంగారెడ్డి	92	రూ.3.84 కోట్లు
మేడ్చల్	19	రూ.79.40లక్షలు

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వారికి వేతనాలను మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ జూన్ 26న ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ జిల్లాకు రూ.3,76,13,700, రంగారెడ్డి జిల్లాకు రూ.3,84,49,700, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు రూ.79,40,700 చొప్పున బడ్జెట్ కేటాయించారు.

గత ఫిబ్రవరిలో నియామక పత్రాలు

ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ-2008 నియామకాల్లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో

మిగతా 7వ పేజీలో...

కేజీబీవీలో పోస్టుల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీలలో ఖాళీగా ఉన్న 12 పోస్టులను భర్తీ చేసేందుకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీ తదితర పోస్టులను భర్తీ చేయుటకు 2022-23 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పరీక్ష మెరిట్ లిస్టులోని అభ్యర్థులను రోస్టర్, మెరిట్ ఆధారంగా 1:3 నిష్పత్తి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో పొందుపర్చిన జాబితాలో ఉన్న అభ్యర్థులు 3వ తేదీన సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలన్నారు. ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ రెండు సెట్ల జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటేనా?



ఆర్నెళ్లుగా అందని గ్యాస్ సబ్సిడీ



ఆందోళనలో మహాలక్ష్మి లబ్ధిదారులు
జిల్లాలో 6,11,118 గ్యాస్ కనెక్షన్లు
సబ్సిడీకి అర్హులు 1,89,945 మంది

మేడ్చల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం అమలు మున్నాళ్ల ముచ్చటగానే మారింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్యాస్ వినియోగదారులు ఆరు నెలలుగా సబ్సిడీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకే గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి కొద్దికాలం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ డబ్బులు జమ చేశారు. ఆ తర్వాత సబ్సిడీ ఊసే లేకుండా పోయింది. దీంతో లబ్ధిదారులు సబ్సిడీ కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా గృహలక్ష్మి, మహాలక్ష్మి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా, గృహలక్ష్మి కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లు వినియోగదారులకు జీరో బిల్లు వస్తోంది. కానీ వంట గ్యాస్ సబ్సిడీ మాత్రం ఖాతాల్లో జమ కావడం లేదు.

అమాంతం పెరిగిన వంట గ్యాస్ ధర

జిల్లాలో 6,11,118 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో సబ్సిడీకి 1,89,945 మంది అర్హులుగా ఉన్నారు. వీరికి గతేడాది మార్చిలో ఈ పథకం ప్రారంభం కాగా, ఏడెనిమిది నెలలు

మిగతా 8వ పేజీలో...



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం

» ఎస్పీ నారాయణరెడ్డి

నవాబుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆయన నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల అవసరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలను ఛేదించడం సులభం అవుతందన్నారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్, ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
» ప్రజావాణిలో 97 దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణి దృష్టికి వచ్చిన సమస్యలను జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియలతో కలిసి ప్రజల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యయ, ప్రయాసాలకోర్చి వారి సమస్యలను పరిష్కారిస్తామనే నమ్మకంతో ప్రజలు తమ వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తిరస్కరించే దరఖాస్తుల గురించి సరైన సమాచారం ఫిర్యాదుదారులకు అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తంగా 97 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఈవో విజయకుమారి, డీఎం, సివిల్ సప్లయ్ అధికారి సుగుణాబాయి, గృహనిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బండవెల్కిచర్లలో మద్యం బంద్

» తీర్మానం చేసిన గ్రామస్తులు

కులకచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో నేటి(మంగళవారం) నుంచి సంపూర్ణ మద్యపాన నిషేధం కొనసాగనుంది. ఈ మేరకు గ్రామస్తులు సోమవారం ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామంలోని యువకులు పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూలై మొదటి నుంచి గ్రామంలో మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని తీర్మానించారు. మద్యం విక్రయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, విక్రయించే వారిని పట్టిస్తే బహుమతి అందిస్తామని యువకులు, మహిళలు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్, పరిగి ఎక్సైజ్ సీఐ, కులకచర్ల ఎస్సైకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బెల్టు షాపుల నిర్వాహణకు ఎలాంటి అనుమతులు లేవని, మద్యం విక్రయిస్తే తమకు సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తామని, అధికారులు వారికి హామీ ఇచ్చారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ముక్కిపోతున్న దొడ్డు బియ్యం


- పందికొక్కుల పాలవుతున్న బియ్యం
- తూకం తగ్గుతుందన్న ఆందోళనలో డీలర్లు

రేషన్ దుకాణాల్లో పేరుకుపోయిన నిల్వలు

కులకచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న క్వింటాళ్ల కొద్ది దొడ్డు బియ్యం ముక్కిపోతున్నాయి. దీంతో పంది కొక్కులు, ఎలుకల పాలవుతున్నాయి. ఈ విషయమై రేషన్ డీలర్లు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో మార్చి నెలలో రేషన్ దుకాణాలకు సరఫరా అయిన దొడ్డు బియ్యం ఆ నెల విక్రయాల అనంతరం నిల్వలు అలాగే మిగిలిపోయాయి. సన్న బియ్యం పంపిణీ చేపట్టడంతో వీటిని తిరిగి సేకరించనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లకు తెలిపారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

దుకాణాల్లో స్థలం లేక..

ఫలితంగా రేషన్ దుకాణాల్లో నిల్వలు ఉన్న బియ్యం బస్తాలు ఎలుకలు, పంది కొక్కులు, లక్క పురుగుల పాలవుతున్నాయి. సంచులకు పెద్దగా చిల్లులు పడుతుండటంతో బియ్యం నేలపాలవుతోంది. ఫలితంగా తూకం తగ్గుతుందని డీలర్లు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు జూన్ నుంచి మూడు నెలల సన్న బియ్యం కోటాను పంపిణీ చేపట్టడంతో సమస్య మరింత తీవ్రమైంది. మూడు నెలల బియ్యం నిల్వలకు దుకాణాల్లో స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి కులకచర్ల మండలంలో 30 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఒక్కొక్క దుకాణంలో దాదాపు 10-30 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ మనోహరచక్రవర్తితో వివరణ కోరగా దొడ్డు బియ్యం రికవరీకి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.



కులకచర్ల మండలంలోని ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం సంచులు

నెరవేరిన ఏళ్ల కల

» హకీంపేట్‌లో జూనియర్ కళాశాల ప్రారంభం

దుద్యాల జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కృషితో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న విద్యార్థుల కల నెరవేరిందన్నారు. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా హకీంపేట్‌లో కళాశాలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. కళాశాలలో 80 మంది విద్యార్థులు చేరారని, విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, మల్లికార్జున్, యుగంధర్‌రెడ్డి, బాలరాజ్‌స్వామి, జయరాములు, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, అంజనేయులు యాదవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలను ప్రారంభిస్తున్న ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్





సీఎన్జీ బైక్‌ల సందడి

- పెరుగుతున్న గ్యాస్ బైక్‌ల కొనుగోళ్లు
- ప్రస్తుతం కిలో సీఎన్జీ రూ.95, వంద కిలో మీటర్ల ప్రయాణం
- కాలుష్య రహిత వాహనాలపై జనం ఆసక్తి
- తగినన్ని గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు లేక సీఎన్జీ వాహనదారుల ఇబ్బందులు


సీఎన్జీ బైక్‌లో గ్యాస్‌ను నింపించుకుంటున్న యువకుడు

ఘట్‌కేసర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు సీఎన్జీ(కంప్రెస్డ్ న్యాచురల్ గ్యాస్)తో నడిచే ద్విచక్ర వాహనాలు సైతం రోడ్లపై సందడి చేస్తున్నాయి. పెట్రోల్‌తో నడిచే బైక్‌లు, కొంతకాలంగా ఎలక్ట్రిక్ వాహనాలు పెరిగిపోతున్న విషయం అందరికీ తెలిసిందే. ఇదే జాబితాలో సీఎన్జీ బైక్‌లు సైతం రోడ్లపై దూసుకుపోతున్నాయి. ఇప్పటి వరకు సీఎన్జీతో కార్లు, మరికొన్ని రకాల ఫోర్ వీలర్లు, ఆటోలు పెద్దఎత్తున తిరుగుతన్నాయి. ఇప్పుడిప్పుడే గ్యాస్‌తో నడిచే బైక్‌లను సైతం వాహన ఉత్పత్తిదారులు మార్కెట్లలోకి విడుదల చేస్తున్నారు. ఈ బైక్‌లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఘట్‌కేసర్‌లోని హైవే పక్కన గల మైసమ్మగుట్ట గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌కు గ్యాస్ ఫిల్‌చేసుకునేందుకు వచ్చిన ద్విచక్ర వాహనదారుడు సురేశ్‌ను స్థానికులు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సురేశ్ స్పందిస్తూ తాను 1.3లక్షలకు సీఎన్జీ బైక్‌ను కొన్నిట్టు చెప్పాడు. రూ.95కు కిలో గ్యాస్ రేటు ఉందని, ఒక కిలో నింపిస్తే తన బైక్ వంద కిలోమీటర్లు నడుస్తుందని తెలిపాడు. కాలుష్య సమస్యలు, శబ్దం లేకుండా బైక్ నడుస్తుందన్నాడు. తన వాహన సిలిండర్ సామర్థ్యం 3కిలోలని, ఒక్కసారి సీఎన్జీ నింపితే 300కిలోమీటర్లు ప్రయాణించొచ్చని వివరించాడు. తన వాహనానికి గ్యాస్ ట్యాంకుతోపాటు పెట్రోల్ ట్యాంక్ కూడా ఉంటుందని, గ్యాస్ దొరకని పక్షంలో పెట్రోల్ సైతం పోయించుకునే వీలుందని చెప్పాడు. కాకుంటే పెరుగుతున్న సీఎన్జీ వాహనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మరిన్ని సీఎన్జీ స్టేషన్లను ఏర్పాటు చేయాలని అన్నాడు. రానురాను ఎలక్ట్రిక్‌తో పాటు సీఎన్జీ వాహనాల సంఖ్య సైతం గణనీయంగా పెరుగుతుందని, సంప్రదాయ ఇంధనాలైన పెట్రోల్, డీజిల్‌ల వినియోగం తగ్గుతుందని అభిప్రాయపడ్డాడు. హైదరాబాద్, నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్లు తక్కువగా ఉండడంతో ఫిల్లింగ్ కోసం వాహనాలు బారులుతీరుతున్నాయి. వాహన కాలుష్యం తగ్గాలంటే గ్యాస్, ఎలక్ట్రిక్ వాహనాలు పెరగాలని, అలాగే గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్యనూ భారీగా పెంచాలని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

తక్కువ ఖర్చుతో ప్రయాణం



సీఎన్‌జీ గ్యాస్ వాహనాలతో ఆర్థికంగా ప్రయోజనం ఉంటుంది. పెట్రోల్‌తో పోలిస్తే 40శాతం నుంచి 50శాతం తక్కువ ఖర్చుతో వాహనాన్ని నడపొచ్చు. వాహన కాలుష్యం కూడా బాగా తక్కువ. పొగ అనేదే రాదు. అయితే గ్యాస్ కోసం క్యూలో నిలబడాల్సి వస్తోంది. అవసరమైనన్ని గ్యాస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారమైతుంది. సీఎన్జీ అంతటా అందుబాటులో ఉంటే పెట్రోల్, డీజిల్ వాహనాల బదులు ఎక్కువ మంది గ్యాస్‌తో నడిచే వాహనాలనే కొనే అవకాశముంది. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

- సురేశ్, సీఎన్జీ బైక్ ఓనర్, ఘట్‌కేసర్

డిమాండ్‌కు సరిపడా సీఎన్జీ సరఫరా లేదు



పర్యావరణంపై ప్రజలకు అవగాహన పెరుగుతండటంతో సీఎన్‌జీ వాహనాల సంఖ్య పెరుగుతోంది. డిమాండ్‌కు సరిపడా గ్యాస్ సరాఫరా కావడంలేదు. రోజులో సగం దినం విక్రయంతో సీఎన్జీ అయిపోతోంది. మిగతా రోజంతా ఖాళీగా ఉంటున్నాం. సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు సీఎన్జీ ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాయి.

- సందుపట్ల జీవన్‌రెడ్డి, సీఎన్జీ స్టేషన్ యజమాని, ఘట్‌కేసర్



మీడియా సంస్థలపై దాడులను సహించం

● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియా సంస్థలపై దాడులను సహించబోమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. మరో మూడు మీడియా సంస్థలపై దాడులుచేస్తామని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అన్యాయాలు, అక్రమాల గురించి మీడియా సంస్థలు ప్రసారం చేయడం, ప్రచురించడాన్ని జీర్ణించుకోలేని ఆ పార్టీ అగ్ర నాయకులు దాడులకు ఉసి గొల్పుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం రాలేదని, యువత బలిదానాలు, మీడియా సహకారంతోనే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యమంలో మీడియా లేకుంటే రాష్ట్రం ఆవిర్భవించేదా? అన్న విషయాన్ని కల్వకుంట్ల కుటుంబం గుర్తించాలన్నారు. రాష్ట్రంలోని మీడియా సంస్థలకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. జగదీశ్వర్‌రెడ్డి తస్మాత్ జాగ్రత్త అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతిపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. పౌర స్వేచ్ఛను హరిస్తూ ఫోన్లు ట్యాపింగ్ చేసి, మీదికెలి సిగ్గులేకుండా దాడులు చేస్తామని అంటావా? నీకు రోజులు దగ్గరపడ్డాయి. ఇంకోసారి మీడియా మీద మాట్లాడితే నాలుక కోస్త జాగ్రత్త. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, కోదండరాంలపై పోలీసులతో దాడుల చేయిస్తే ఆ పార్టీల కార్యకర్తలు తిరగబడ్డారా? అని ప్రశ్నించారు. పత్రికలు, చానళ్లలో తప్పుడు వార్తలు, కథనాలు వస్తే వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలేగానీ దాడులు సమంజసం కాదన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, అగ్గనూరు విశ్వం, బాలరాజు, చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ పట్టణంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేస్తున్నామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. 14వ వార్డులో సీసీ రోడ్డు పనులను, కమ్యూనిటీ హాలు, ఫరూఖ్‌నగర్ ప్రధాన సీసీ రోడ్డు, 22వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్ కోరిక మేరకు విజయనగర్ కాలనీ పార్క్‌కు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో ఉప్పల వెంకటేశ్వం తదితరుల ఇళ్లకు వెళ్లి కలిశారు. మునిసిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతానని, అందుకు ప్రజల సహకారం అవసరం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, కాంగ్రెస్ నాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరి బస్వం, జమ్మద్‌ఖాన్, ఇబ్రహీం, రాజేందర్‌రెడ్డి, మోహన్, సరితయాదగిరి,అర్జున్, లక్ష్మణ్, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ హార్వెస్టింగ్ నిర్వహణకు తోడ్పాటు


సీజీఆర్ సంస్థ ప్రతినిధులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ పర్యావరణ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'యంగ్ ఎర్త్ లీడర్' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పీఎం శ్రీ టీజీఎంఎస్ పాల్మాకుల పాఠశాలలో సీజీఆర్ సంస్థ రంగారెడ్డి జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్ బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. వివరాలను ప్రిన్సిపాల్ రజనికుమారి నుంచి నమోదు చేసుకున్నారు. రజనికుమారి మాట్లాడుతూ.. పాఠశాలలో హార్వెస్టింగ్, పీట్, కంపోస్టు పీట్, నో ప్లాస్టిక్ జోన్, డిక్లరేషన్ ఆఫ్ మదర్ ట్రీ, కిచెన్ గార్డెన్, సాయిల్ అండ్ సీడ్ మ్యూజియం, సోలార్ ఎనర్జీ వంటి కార్యక్రమాల నిర్వహణకు తోడ్పాటును అందిస్తున్న సీజీఆర్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, రవీందర్‌రెడ్డి, విద్యార్థులు ఆకాంక్ష, వైష్ణవి, శ్వేత, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పెద్దపీట


స్వయం ఉపాది పథకాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

కడ్తాల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువత ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 18నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 60వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని పేర్కొన్నారు. కడ్తాల్లో రాకేశ్ ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి పథకాన్ని సోమవారం వారు ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి పథకాలు చేపట్టి మరి కొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు. ఉపాధి శిక్షణకు ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బిక్యానాయక్, జిల్లా నాయకుడు వెంకటేశ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, రాజు, పాండు, జహంగీర్‌అలీ, శ్రీను, సురేశ్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎదులాబాద్‌లోని సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. పదిరోజులగా సాగిన 'బాయ్స్ ఫర్ చెయింజ్' ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఉత్తమ పౌరులుగా ఎదిగి స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో బాయ్స్ ఫర్ చెయింజ్ కార్యక్రమం నిర్వాహకుడు క్రిస్టఫర్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలి

చౌదరిగూడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వనంపల్లి వన నర్సరీని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయాల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో టీఏలు లక్ష్మారెడ్డి, వినోద్, దేవోజీ, పంచాయతీ కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా గవర్నర్‌గా నేడు బాధ్యతలు చేపట్టనున్న మహేంద్రకుమార్‌రెడ్డి



కందుకూరు, జూన్30(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్-320ఎ జిల్లా గవర్నర్‌గా డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు తీసుకోనున్నారు. 2007-08లో లయన్స్ క్లబ్ ఆఫ్ కందుకూరు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నికై, భూలక్ష్మీ మెమోరియల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్న మహేంద్రకుమార్‌రెడ్డి క్లబ్‌లో జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలో మండలాలు, మున్సిపాలిటీల్లో 90క్లబ్‌లు ఉన్నాయని మహేంద్రకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాలతో పాటు పాత నైజాం ప్రాంతంలోని కల్యాణ కర్ణాటక క్లబ్‌లు, రాయచూర్, సేడం, గుల్బర్గా, యాద్గిర్, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో క్లబ్‌లు ఉంటాయని, వీటిల్లో 3,500మంది సభ్యులున్నట్లు తెలిపారు. తనను జిల్లా గవర్నర్‌గా నియమించేందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

హెలెన్ కెల్లర్ సేవా వారోత్సవాలు

జులై 1న తాను జిల్లా గవర్నర్‌గా బాధ్యతల స్వీకరణ సందర్భంగా 1 నుంచి 8వ తేదీ వరకు హెలెన్ కెల్లర్ సేవా వారోత్సవాలు అన్ని క్లబ్‌లలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కంటి వైద్యశిబిరాలు, కాటరాక్ట్ ఆపరేషన్లు, రక్తదాన, డయాబెటిక్ నిర్ధారణ శిబిరాలు, స్కూల్ విద్యార్థులకు స్టేషనరీ అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్

తాండూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకుందామని సమితి జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అధ్యక్షుడిగా 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ అవిర్భవించిందన్నారు. వర్గీకరణకు సహకరించిన రాజకీయ పార్టీలకు ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన గ్రామాల్లో జెండా దిమ్మెలు నిర్మించి జెండా ఎగరవేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జగదీష్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణ, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, మండలాధ్యక్షుడు సూర్య ప్రకాశ్, పెద్దేముల్ మండలాధ్యక్షుడు ఉమాశంకర్, టౌన్ ప్రెసిడెంట్ బలరాం, రవికుమార్, ఎంఎస్ఎఫ్ కన్వీనర్, కార్యదర్శి పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు


అహ్మద్‌గూడలో డ్రగ్స్‌పై అవగహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

కీసర, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస కావొద్దని కీసర పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో ఓ ప్రైవేట్ పాఠశాలలో సోమవారం డ్రగ్స్‌పై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రులు వారి నడవడిక, ప్రవర్తలన పట్ల నిత్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యువత, విద్యార్థులు వ్యసనాల బారినపడకుండా, చదువుపై దృష్టి సారించేలా సమాజంలోని ప్రతి ఒక్కరు కృషిచేయాలని సీఐ కోరారు.

హెడ్ కానిస్టేబుల్ కారు టైర్ల అపహరణ



దుండగులు నాలుగు టైర్లను ఎత్తుకుపోయిన కారు

శంషాబాద్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ కారు నాలుగు టైర్లను అపహరించిన సంఘటన ఆదివారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్‌కు చెందిన కృష్ణాగౌడ్ నార్సింగి ట్రాఫిక్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శంషాబాద్ పరిధి శ్రీనివాస్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన తన మారుతి బెలెనో కారును ఇంటి వద్ద పార్క్ చేశాడు. సోమవారం తెల్లవారుజామున 4గంటలకు కారులో వచ్చిన ఇద్దరు దొంగలు కారు నాలుగు టైర్లు విప్పుకుపోయారు. ఉదయం గుర్తించిన కృష్ణ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా ఇద్దరు టైర్లు విప్పుకుపోయినట్టు తేలింది. టైర్ల విలువ రూ.60వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకుంటామని చెప్పారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

షాద్‌నగర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రిలో అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను కలెక్టర్ రద్దుచేసినట్లు తహసీల్దార్ పార్థసారథి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సింహారెడ్డి భూమిని అతడి భార్య నవనీత సహకారంతో నకిలీ జీపీఏతో మొదట శ్రీకాంత్‌రెడ్డి పేరిట, అనంతరం ఆమె కుమారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. మరో కేసులో కొత్తపల్లి సుభాన్‌రెడ్డి చిన్న కొడుకు శ్రీనివాస్‌రెడ్డి మృతితో అతడి భార్య వినోదకు వారసత్వంగా సంక్రమించిన భూమిని సుభాన్‌రెడ్డి, అతడి పెద్దకొడుకు మధుసూదన్‌రెడ్డిలు నకిలీ జీపీఏతో రిజిస్టర్ చేయించుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో విషయం బయటపడటంతో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ విచారణలో అక్రమాలు తేలడంతో రిజిస్ట్రేషన్ల రద్దుకు ఆర్డీవోకు సిఫారసు చేయగా కలెక్టర్‌కు నివేదిక పంపారు. రెండు రిజిస్ట్రేషన్లు రద్దుచేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారని తహసీల్దార్ తెలిపారు.

మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తాం



ఆరుట్లలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ హన్మంతరెడ్డి

మంచాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి):ఆరుట్లలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామని మంచాల పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంతరెడ్డి తెలిపారు. ఆరుట్లలోని పాత పీఏసీఎస్ ప్రాంగణంలో నిర్మిస్తున్న మార్కెట్‌ను సోమవారం ప్యాక్స్ డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయ కూడలిలో రోడ్లపైనే కూరగాయల అమ్మకాలతో వాహనదారులకు, రైతులకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో పాత పీఏసీఎస్ ప్రాంగణంలోని ఖాళీస్థలంలో మార్కెట్‌కు నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేష్‌యాదవ్, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, బుగ్గరాములు, జంగయ్యాయాదవ్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చేవెళ్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలో మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జూలై 2, 3, 4తేదీల్లో చేపట్టనున్న 75 గంటల కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. 2024-25 విద్యా సవంత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7,200 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో సీఐ గంగాధర్

కడ్తాల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్స్ సోల్జర్లుగా పనిచేయాలని కడ్తాల సీఐ గంగాధర్ అన్నారు. అన్ని గ్రామాల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతూ విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు, వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం స్టేషన్ ఆవరణలో బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్ఐ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకిచ్చిన హామీలను నేరవేర్చాలి



శాంతియుత దీక్షలో మాట్లాడుతున్న చంద్రారెడ్డి

కీసర, జూన్30(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నేరవేర్చాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కె.చంద్రారెడ్డి అన్నారు. ఉద్యకారులు నాగారం పరిధిలో సోమవారం ఒక్క రోజు శాంతియుత దీక్షచేశారు. దీక్షకు చంద్రారెడ్డి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అమరుల త్యాగం, ఉద్యమకారుల పోరాటాలను గత ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ప్రజాపాలన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఘట్‌కేసర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కార్మికులు కమిషనర్ రాజేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు సత్కరించారు.. వారి సమస్యలను విరించారు. విలీన పంచాయతీల కార్మికులకు మున్సిపల్ కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు షూలు, చెప్పులు, డ్రెస్సులు, నూనె, సబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయచంద్ర, సువర్ణ, రాంచందర్, శ్రావణి, శోభ, భూపాల్, రాంకుమార్ ఉన్నారు.

కాంట్రాక్ట్ టీచర్లకు తీపి కబురు

(ఐదో పేజీ తరువాయి)

మంచి మార్కులు సాధించి మెరిట్ జాబితాలో తమ పేర్లు ఉన్నా.. డీఈడీ లేకుండా బీఈడీ అర్హతలు ఉన్న అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమైన విషయం తెలిసిందే. ఆ డీఎస్సీలో ఎంపికైన ఎస్‌జీటీ అభ్యర్థుల్లో డీఈడీ అర్హతలు ఉన్న అభ్యర్థులకే ఎస్‌జీటీ ఉద్యోగాలు కల్పించడంతో మెరిట్ జాబితాలో ముందున్నా.. బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యారు. మెరిట్ జాబితాలో ఎంపికైన తమకు ఉద్యోగాల్లో నియమించాలని డిమాండ్ చేస్తూ నష్టపోయిన అభ్యర్థులు న్యాయ పోరాటానికి దిగారు. అప్పటి నుంచి ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తూ తమకు న్యాయం చేయాలని వేడుకున్న విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారికి న్యాయం చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మెరిట్ జాబితాలో ఉండి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులను కాంట్రాక్టు విధానంలో ఎస్‌జీటీలుగా నియమిస్తూ గత ఫిబ్రవరి 14న నియామక పత్రాలు అందజేశారు.

అందని తొలి వేతనం

ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ఎస్‌జీటీలుగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు వేతనాలు మంజూరు కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు విధులు నిర్వహించగా.. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభమైన జూన్ 12 నుంచి కాంట్రాక్టు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు తమ విధులకు హాజరవుతున్నారు. ఎట్టకేలకు వారి వేతనాల కోసం బడ్జెట్ విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపు బాధ్యతలను కలెక్టర్, డీఈవోలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తర్వులు జారీ అయ్యాయి



కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలో ఆ ఉపాధ్యాయులకు వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం.

- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

సౌభాగ్యానికి చిహ్నం గోరింటాకు

ఆషాఢంలో మహిళల మైదాకు ఉత్సవాలు

- పల్లె, పట్టణ ప్రాంతాల్లో మెహందీ వేడుకలు
- గోరింటాకును శుభ సూచికంగా భావించే మహిళలు



మహిళల చేతిలో గోరింటాకు

వికారాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ఆరంభంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆషాఢ సంబరాలు మొదలయ్యాయి. ఈ మాసంలో మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. చేతికి గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. గోరింటాకు పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా గోరింటాకు, బోనాల జాతరలు మొదలయ్యాయి. నోము రోజు ఉదయం ఉపవాసం ఆచరిస్తూ, సాయంత్రం గోరింటాకు పెట్టుకోవడం ఇక్కడి మహిళల ఆనవాయితీ.



పూజలకు ప్రత్యేకం.. ఆషాఢం

ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు విష్ణు భగవానుడు పాలకడలిపై యోగ నిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా ఆచరిస్తారు. శుద్ధ పౌర్ణమినాడు గురుపౌర్ణమిగా వ్యవహరిస్తారు. భాగవతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజును వ్యాసపౌర్ణమి అంటారు. ఈ మాసంలో ఆడవారు ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకుంటారు. ఆహారంలో మునగకాయను వాడతారు. శుద్ధ ఏకాదశినే మహా ఏకాదశి అని కూడా అంటారు. జనసామ్యంలో తొలి ఏకాదశి అంటారు. ఇంద్రియ నిగ్రహానికి ఆహార నియమాలు తీసుకుంటూ పూజలు, వ్రతాలతో దంపతులు బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. ఇదే నెలలో ఊరూరా గ్రామ దేవతలకు బోనాల పండుగను నిర్వహిస్తారు.

గోరింటలో ఔషధ గుణాలు

గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతంగా మహిళలు భావిస్తారు. చేతులు, కాళ్లకు గోరింటాకు కొత్త అందాన్నిస్తుంది. గోరింట ఎంత ఎర్రగా పండితే.. అంత మంచి భర్త వస్తాడని యువతుల నమ్మిక. శుభానికి చిహ్నంగానూ గోరింటాకును భావిస్తారు. శరీర వేడిని తగ్గించేందుకు గోరింటాకు దోహదం చేస్తుంది. మనిషి రోగ నిరోధక శక్తిని పెంచుతుది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. తరచూ గోరింటాకు తప్పక పెట్టుకోవాలని వైద్యులు సైతం సలహా ఇస్తున్నారు. పెళ్లి, ఇతర శుభకార్యాలు, పండగలప్పుడు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. గోరింటాకును స్త్రీలు సౌభాగ్యానికి చిహ్నంగా భావిస్తారు. పట్టణాల్లో మహిళలు సమూహంగా కూర్చొని గోరింటాకు పెట్టుకుంటారు.

అలంకరణకే కాదు.. ఆరోగ్యానికీ మేలే



గోరింటాకు అలంకరణకే కాకుండా ఆర్యోగానికి కూడా ఉపకరిస్తుంది. ఇంట్లో ప్రతి శుభకార్యానికి గోరింటాకు తప్పక వాడుతారు. వేసవి కాలం తరువాత వాతావరణంలో మార్పులకు అనుగుణంగా శరీరంలో ఉన్న వేడిని నియంత్రించి ఆరోగ్యాన్ని కాపాడడంలో గోరింట పాత్రపోషిస్తుంది.

- శిరీష, బీజేపీ పట్టణాధ్యక్షురాలు, వికారాబాద్

నోముల మాసం.. ఆషాఢం



పవిత్ర మాసం ఆషాఢంలో అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. ఆడపడుచులు నోములతో పాటు పూరి జగన్నాథ రథయాత్రను జరుపుకుంటాం. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం ప్రత్యేకం. వాతావరణ మార్పుల నుంచి రక్షించుకోవడం, ఆడవారి చేతులు అందంగా కన్పించేందుకు గోరింటాకును అలంకరించుకుంటారు.

- మంజుల, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, వికారాబాద్

చేవెళ్ల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జిగా అనంతకిషన్

సంగారెడ్డి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా తోపాజి అనంతకిషన్ నియమితులయ్యారు. సంగారెడ్డికి చెందిన అనంతకిషన్‌ను చేవేళ్ల ఇన్‌చార్జిగా నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు ఎం.మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో చేవెళ్ల ఇన్‌చార్జిగా నియమించిన ఎం.మహేశ్‌కుమార్‌గౌడ్‌కు, అందుకు సహకరించిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాశ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



బాలేశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న మహేందర్‌రెడ్డి, ఎంఈవో తదితరులు

మోమిన్‌పేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తీర్చిదిద్ది భావి పౌరులుగా తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మోమిన్‌పేట్ జెడ్పీ బాలుర పాఠశాలలో మహ్మద్ షఫీ, వెల్చాల్ జెడ్పీ పాఠశాల హెచ్ఎం బాలేశ్వరయ్యల రిటైర్మెంట్ సందర్భంగా ఎంఈవో మల్లేశంతో కలిసి సన్మానించారు. టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్, ప్రభు, అరుణ్‌కుమార్, మల్లేశం, సమ్మయ్య, రమేశ్, నాగేశ్వర్, జ్యోతి, మధుకర్, నీలాంబిక, మహేశ్ పాల్గొన్నారు.

చెత్త ఏరే చేతులకు పలకా బలపం

- వీధి బాలలను బడిలో చేర్పించిన ఎమ్మెల్యే
- పాఠశాల నిర్మాణానికి హామీ
- పిల్లలకు డ్రెస్సులు, పుస్తకాల అందజేత



ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ వీధుల్లో భిక్షాటన చేస్తూ, చెత్త ఏరుకునే చిన్నారుల చేతులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలక బలపం పట్టించారు. బాలబాలికలను ఎమ్మెల్యే స్వయంగా ఆటోలో తీసుకెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని సిండికేట్ కాలనీలో సంచార దేవర జాతివారు కొన్ని సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం గడుపుతున్నారు. పట్టణ వీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తూ, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇనుప ముక్కలు, అట్టలను ఏరుకుని జీవనం గడుపుతున్నారు. వారి పిల్లలను బడికి పంపకుండా వెంట తిప్పుకుంటూ భిక్షాటన చేయిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకుని ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్ పాఠశాలకు వెళ్లని 25 మంది పిల్లలు ఉన్నారని, వారిని పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు నచ్చచెప్పాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం ఎమ్మెల్యే స్వయంగా సిండికెట్ కాలనీలోని దేవరజాతివారి గుడిసెల వద్దకు వెళ్లి, పిల్లలు, వారి తల్లిదండ్రులను సమావేశపర్చారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే పైసా ఖర్చులేకుండా చదువుకుంటారని, వారికి బట్టలు, పుస్తకాలను ప్రభుత్వమే ఇస్తుందని చెప్పారు. పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులకు సంక్షేమ పథకాలను ఇస్తామని హామీ ఇచ్చారు. గుడిసెల నుంచి ఆర్టీసీ కాలనీ పాఠశాల వరకు ఆటోను పెట్టి పిల్లలను తీసుకు వెళ్లి, తిరిగి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. రెండు నెలల్లో సిండికేట్ కాలనీ పరిసరాల్లో ప్రభుత్వ పాఠశాలకు భవనాన్ని నిర్మించి నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. దాంతో పిల్లలందరినీ పాఠశాలకు పంపడానికి అంగీకరించడంతో వారికి డ్రెస్సులు, పుస్తకాలను అందించారు. ఎమ్మెల్యే స్వయంగా ఆటోలో పిల్లలను ఎక్కించుకుని ఆర్టీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు ఇప్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి మాట్లాడుతూ చదువుతోనే జీవితాలు బాగుపడుతాయని స్పష్టం చేశారు. తాను కూడా గుడిసెల్లో ఉన్నానని, మా అమ్మ కూలీపని చేసి, నన్ను చదివించడంతోనే ఈనాడు ఎమ్మెల్యేను అయ్యానని వివరించారు. వీధి బాలలను గుర్తించి, వారు బడిబాట పట్టే విధంగా కృషి చేసిన ఎంఈఓ మనోహర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఏ.శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు, సురేష్, వెంకటయ్య, సత్యం పాల్గొన్నారు.

పనిచేసినోళ్లకే పార్టీ పదవులు

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మట్లాడుతన్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

బషీరాబాద్/ తాండూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పనిచేసినోళ్లకు పదవులు దక్కుతాయని, అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం సంస్థాగత ఎన్నికల్లో భాగంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీలో పాత, కొత్త తేడా లేకుండా ప్రాధన్య క్రమంలో పదవులుంటాయన్నారు. పార్టీ బలోపేతం చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సమావేశాల్లో చర్చించిన తర్వాతే అభ్యర్థులకు టికెట్లు ఇస్తామన్నారు. అంతకు ముందు నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం కమాన్ నుంచి ఆలయం వరకు 1.5కిలోమీటరు రోడ్డు పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల కార్యకర్తల సమావేశంలో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 4న హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుందని తెలిపారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వస్తారన్నారు. పార్టీ మండల పదవులకు, నామినేటెడ్ పోస్టులకు శ్రేణులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోకుంటే మనం వండిన అన్నం ఇతరుల పాలవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బషీరాబాద్‌లో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేష్ మాట్లాడుతూ.. పార్టీలోని ఒరిజనల్ నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకపోవడం తగదని అన్నారు. సమావేశంలో ఆయన మట్లాడుతూ.. పాత నాయకులను పట్టించుకోకుండా, కొత్తవారికి పెద్దపీట వేయడం ఏమిటని ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్‌ను నమ్ముకొని ఎందరో నాయకులు ఏళ్లనుంచి పనిచేస్తున్నారని, వారిని పట్టించుకోరా? అని అన్నారు. ఇటీవల పార్టీ నాయకుల అంశంపై తమ దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదని ఎమ్మెల్యేనుద్దేశించి అన్నారు. ఒరిజినల్ నాయకులకు గుర్తింపునివ్వకుంటే ధర్నాకు దిగేందుకైనా సిద్ధమని హెచ్చరించారు. మనోహర్‌రెడ్డి స్పందిస్తూ.. అందరినీ కలుపుకొని పోతానని అన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు వినోద్‌రెడ్డి, నరేందర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బషీరాబాద్, తాండూరు ఏఎంసీ చైర్మన్లు జి.మాధవరెడ్డి, బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, నాయకులు ఉత్తంచంద్, శరణుబసప్ప, రాజ్‌కుమార్, అనిల్, సుధాకర్, రాందాస్, గోపాల్, రఘునాథ్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, సొసైటీ చైర్మన్ ఏ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్, శ్రీనివాస్‌రెడ్డి, శంకరప్ప, బషీరాబాద్ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులు, రాజవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, శంకర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అందరి సహకారంతో విధులు నిర్వహించా

- రిటైర్మెంట్ వీడ్కోలో డీఎంహెచ్‌వో వెంకటరవణ

వికారాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 8నెలలుగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సహకారంతోనే తాను సమర్థంగా పనిచేసేందుకు కృషిచేశానని డీఎంహెచ్‌వో వెంకటరవణ అన్నారు. సోమవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా వికారాబాద్‌లోని ఓ హోటల్‌లో వేడుక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తాను వికారాబాద్ టీబీ ఆస్పత్రిలో పనిచేశానని చెప్పారు. అతనకు అన్ని విధాలా సహకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డీఎంహెచ్‌వో తుకారాం, డాక్టర్ రవీంద్రయాదవ్, రిటైర్డ్ డీఎంహెచ్‌వో షిండే, జీజీహెచ్ సూపరింటెండెంట్ రామచంద్రయ్య, డీసీహెచ్ఎస్ ఆనందం, పవిత్ర, జానీ, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వెంకటరవణ దంపతులను సన్మానిస్తున్న వైద్యశాఖ అధికారులు



ఐటీఐలో డ్రెస్ మేకింగ్ ప్రదర్శన

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో తొలిసారి డ్రెస్ మేకింగ్ ప్రదర్శన నిర్వహించారు. ఇన్‌స్ట్రక్టర్ ఉదయ్ కుమార్ శిక్షణలో విద్యార్థులు టైలరింగ్ నేర్చుకున్నారు. క్లాత్ బ్యాగులు, హ్యాండ్ బ్యాగ్స్, పిల్లో కవర్స్ కిడ్స్‌వేర్, మెన్స్‌వేర్ తయారు చేశారు. ముఖ్య అతిథిగా సోమవారం ఐఎంసీ చైర్మన్ గరిమెళ్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కాలానికి అనుగుణంగా ఐటీఐల్లో వివిధ నూతన ట్రేడ్లను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, టీఓ సరూష్ విద్యార్థులను అభినందించారు. ఏటీవోలు రవికుమార్, రాకేశ్, శ్రీశైలం, మథిన్, స్వాతి పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ ఉపాధ్యక్షుడు టి.వజ్రేష్‌యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తోందని చెప్పారు. ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పిల్లర్ల గుంతలు తీశాడు. ఇళ్ల లబ్ధిదారులు సంతోషంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షుడు వేములు మహేశ్ గౌడ్, మాజీ చైర్‌పర్సన్ పావని, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ముత్యాలు, రమేష్, ముల్లి జంగయ్య, మాధవరెడ్డి, అమర్, విశ్వనాథ్ రాజేందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్, ఓంప్రకాశ్, రమేష్, శ్రీనాథ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటేనా?

(ఐదో పేజీ తరువాయి)

సబ్సిడీ అందింది. ఆ సమయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.874 ఉండగా ప్రభుత్వం రూ.500 చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమ చేసేది. మిగతా మొత్తం లబ్ధిదారులు చెల్లించేవారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ.40లను సబ్సిడీ కింద జమ చేస్తుంది. ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో అందించాల్సిన రూ.500 సబ్సిడీ రాకపోవడంతో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీ డబ్బులు రాకపోవడంతో లబ్ధిదారులు సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడ ఎల్‌పీజీ గ్యాస్ కంపెనీలు ఒక్కసారిగా ధరలను పెంచడంతో ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ రూ.924గా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీని సకాలంలో అందించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరతున్నారు.

వెంటనే సబ్సిడీ ఇవ్వాలి



వంట గ్యాస్‌పై సబ్సిడీ ఆర్నెళ్లుగా రావడం లేదు. దీంతో మొత్తం డబ్బులు చెల్లించి గ్యాస్ కొనుగోలు చేస్తున్నాం. గ్యాస్‌పై సబ్సిడీ ఇస్తామని హామీ ఇచ్చిన మేరకు వెంటనే బ్యాంక్ ఖాతాల్లో జమయ చేయాలి. రాయితీ రాకపోవడంతో ఆర్థిక భారం పెరుగుతోంది. ప్రభుత్వం వెంటనే సబ్సిడీ ఇవ్వాలి. -మద్దె లతావెంకటేశ్‌గౌడ్, మర్రిపల్లిగూడ, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

నామినేటెడ్ పదవులకు దరఖాస్తుల స్వీకరణ



యాలాల: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

యాలాల/పెద్దేముల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారికే నామినేటెడ్ పోస్టులు లభిస్తాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డిలు సూచించారు. యాలాల, పెద్దేముల్ మండలాల్లో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారికి కచ్చితంగా నామినేటెడ్ పదవులు దక్కుతాయని వారు సూచించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు నామినేటెడ్‌ల కోసం దరఖాస్తులను జిల్లా పార్టీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు వినోద్‌కుమార్‌రెడ్డి, తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ మహరాజ్, బాల్‌రెడ్డి, భీమప్ప, చెన్నారం అనిల్‌కుమార్, జక్కేపల్లి అమృతయ్య పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి పెద్దపీట

యాలాల: గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. యాలాల మండల మండల పరిధిలోని పగిడిపల్లి నుంచి పటేల్ చింత తండాకు వెళ్లేందుకు రూ.కోటీ 85లక్షలతో నిర్మించ తలపెట్టిన బీటీరోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పటేల్ చింత తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భీమప్ప, అనిల్ కుమార్, బాల్‌రెడ్డి, రాజు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ వస్తువులను బహిష్కరించాలి



పరిగి: ర్యాలీ నిర్వహిస్తున్న స్వదేశీ జాగరన్‌మంచ్ ప్రతినిధులు

కులకచర్ల/పరిగి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విదేశీ వస్తువులను బహిష్కరించాలని స్వదేశీ జాగరణ మంచు రాష్ట్ర నాయకుడు బెంగాల్ ఈశ్వర్ అన్నారు. స్థానిక న్యూ కృష్ణవేణి పాఠశాలలో సోమవారం స్వదేశీ జాగరణ మంచు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దేశ అభివృద్ధిలో స్వదేశీ వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సౌమ్యరెడ్డి, విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ విజయ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పరిగిలోని శ్రీసాయి ఒకేషనల్ కళాశాలలో స్వదేశీ జాగరన్ మంచ్ కో-ఆర్డినేటర్ ఈశ్వర్ విద్యార్థులకు స్వదేశీ, స్వావలంబన అనే ఆంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాము, ప్రిన్సిపాల్ శ్రీశైలం, విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భద్రతా భావం పెంపునకు కవాతు



వికారాబాద్‌లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ మాక్ డ్రిల్

తాండూరు/వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో భద్రతా భావం పెంపొందించేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం రాపిడ్ యాక్షన్ ఫోర్స్, వికారాబాద్ ప్యూరిటీ ఫోర్స్ తాండూరు పట్టణ పోలీస్‌శాఖ సంయుక్తంగా కవాతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోష్ కుమార్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులు, ఆర్పీఎఫ్ పోలీస్ శాఖ, ప్యూరిటీ ఫోర్స్ సిబ్బంది పాల్గొంది. అదేవిధంగా వికారాబాద్ పట్టణంలో సోమవారం సాయంత్రం రాపిడ్ యాక్షన్‌ఫోర్స్ మాక్ డ్రిల్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రోడ్ల గుండా మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు మేము ఉన్నామనే ధైర్యం కల్పించారు.

ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులకు భవిష్యత్తు



తాండూరు రూరల్: ప్రధానోపాధ్యాయుడు మృతంజయ స్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు: ప్రసంగిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

తాండూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం జినగుర్తి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మృతంజయస్వామి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. మృతంజయస్వామి ఉపాధ్యాయుడిగా చేసిన సేవలను ఆయన కొనియడారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, ఎంఈవో వెంకటయ్య, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు ఎం. రమేష్, డిసిసిబి వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, ఏఎంసి చైర్మన్ బాల్‌రెడ్డి, మండల పిఆర్టియు అధ్యక్షుడు జొన్నల వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నాగప్ప, ఇంచార్జ్ హెచ్‌ఎం రవీందర్ కుమార్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్, ఎల్‌ఐసి వీరేశం, బాబ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో ఉపాధ్యాయుడు ఎన్.హన్మప్ప ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా అనేక సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన హన్మప్పకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాలాల మండల తపస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, ముఖ్యవక్తగా భాస్కర యోగి, తపస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు విష్ణువర్ధన్, యలాల, బషీరాబాద్ మండలాల ఎంఈఓలు రమేష్, రాములు, తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు, ఆనందం, అంజిరెడ్డి, బహదూర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిగి: గడ్డమీది పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కనకచారి కోపమెరుగని పండితుడని పలువురు కొనియాడారు. సోమవారం కనకచారి ఉద్యోగ విరమణ కార్యక్రమం కన్యకాపరమేశ్వరి మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.సదానందం మాట్లాడుతూ.. కనకచారి తన సర్వీసులో ఏనాడు కూడా విద్యార్థులు, ఉపాధ్యాయుల పట్ల కోపమనేది కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి షఫీ, నాయకులు బసిరెడ్డి, పవన్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చౌడాపూర్: మరికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జూలూరి విజయలక్ష్మి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలోఉపాధ్యాయులు ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎం సర్వమంగళ, ఉపాధ్యాయులు సరస్వతి, శైలజ, మల్లప్ప, రామకృష్ణ, శివప్రసాద్, మల్లయ్య, అంజిలయ్య, పాండురంగయ్య, చారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పదు



ఘట్‌కేసర్ రూరల్: ఎస్ఐ మహేందర్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని రాచకొండ కమిషనరేట్ మల్కాజ్‌గిరి డివిజన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఎస్ఐ తోట మహేందర్ పదవి విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో మహేందర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, సీఐలు పందిరి పరశురాం, శ్రీనివాస్, ఎస్ఐలు ప్రభాకర్‌రెడ్డి, సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరు: ప్రతీ ఉద్యోగి అంకిత భావంతో పనిచేయాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభలో డీఎస్పీ పాల్గొని ప్రసంగించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ వరకు వివిధ స్థాయిలో మహిపాల్‌రెడ్డి సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, సిబ్బంది శాలువాలతో మహిపాల్‌రెడ్డిని సన్మానించారు.

సేవలకు గుర్తింపు లభిస్తుంది

కులకచర్ల: సేవలందించిన వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సన్మాన సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.అంజనేయులు హాజరై మాట్లాడుతూ.. పీడీ వెంకటేశ్వర్లు సేవలను కొనియాడారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తాం



వికారాబాద్: ఇందిరమ్మ ఇంటి పట్టాను అందజేస్తున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజంచేస్తామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 33వ వార్డు బీటీఎస్ కాలనీకి చెందిన స్వరూప ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేయగా వారికి ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

దోమ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు గడువులోపు పూర్తిచేయాలని ఎంపీడీవో గ్యామానాయక్ అన్నారు. బాసుపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేయించారు. అదేవిధంగా అయినాపూర్ గ్రామంలో వననర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతయ్య పాల్గొన్నారు.

పరిగి: నిరుపేదలకు సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు పాలాది శ్రీనివాస్, పరిగి పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణలు అన్నారు. రుకుంపల్లి, నస్కల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశోక్, చంద్రయ్య, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా ప్రజావాణి

పెద్దేముల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు పరిష్కర వేదిక ప్రజావాణి కార్యక్రమం పెద్దేముల్ మండలంలో మొక్కుబడిగా కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కార్యాలయంలో అధికారులు ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా ఒకరిద్దరు అధికారులు హాజరై మమా అనిపిస్తున్నారు. వచ్చిన సమస్యలు ఒక్కటీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ఈఏడాది ప్రారంభం నుంచి కేవలం 11దరఖాస్తులు మాత్రమే వచ్చాయంటే ఈ కార్యక్రమంపై ప్రజల్లో ఎంతవరకు నమ్మకముందో అర్థం చేసుకోవచ్చు. ప్రజావాణి నిర్వహించే అధికారి సైతం వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘట్‌కేసర్‌లో మోస్తరు వర్షం

ఘట్‌కేసర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. దాదాపు అరగంట పాటు కురిసిన వర్షంతో భూమిపై ఎండిపోతున్న గడ్డికి కాస్తా ఉపిరి పోసినట్లు అయ్యిందని రైతులు వివరించారు.

మార్కెట్ కమిటీ కార్యదర్శి బదిలీ

పరిగి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శి విజయకిషోర్ బదిలీ అయ్యారు. విజయకిషోర్ పదోన్నతిపై ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మార్కెట్ కమిటీకి వెళ్లారు. పరిగి మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలను డీఎంవో సారంగపాణి తీసుకున్నారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి

మోమిన్‌పేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు పౌరహక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌ఐ గోవర్ధన్, ఏఎస్ఐ వెంకటయ్య అన్నారు. మండలంలోని మల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్థులకు పౌరహక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇందిరా, సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హుసేన్ పూర్‌లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సంలో ఎస్సీ వసతి గృహ అధికారి హన్మంత్‌రెడ్డి, ఆర్‌ఐ రాఘవేందర్‌లు గ్రామస్థులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ యాదయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి కొండన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఘనపూర్‌లో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ కుల నిర్మూలనకు ఎస్సీ, ఎస్టీ కులాల వారిని చైతన్యపర్చేందుకు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారుల సమన్వయంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పరిగి: లక్నాపూర్‌లో తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు పౌరహక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, ఎంపీడీవో కరీం, ఎంఈవో గోపాల్,వివిధ శాఖలఅధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

షాద్‌నగర్ బస్సును పునరుద్ధరించాలి

పూడూరు: కడుమూరుకు షాద్‌నగర్ ఆర్టీసీ డిపో బస్సును పునరుద్ధరించాలని గ్రామస్థులు డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన శేఖర్, రమేష్, బాలకృష్ణ షాద్‌నగర్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్‌ను సోమవారం కలిశారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి

కొడంగల్ రూరల్: సమయానుకూలంగా బస్సులు నడపాలని ఎంఈవో రాంరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుద్రారం, నీటూర్, అప్పాయిపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలకు ఆలస్యంగా రావాల్సిన పరిస్థితి ఉందన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలతో జనం విసుగెత్తారు

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు, నాయకుల అవినీతి అక్రమలతో ప్రజలు విసిగిపోయారని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి అన్నారు. బషీరాబాద్‌లో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌సింగ్, నాగేంద్రయ్య రజాక్, తహేర్‌బాండ్, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మర్పల్లి: చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ గఫర్ అన్నారు. సిరిపూరం, పెద్దాపూర్ గ్రామాల్లో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ తుల్జరాం, ఆర్ఐ వెంకటేశం, గోపాల్‌రెడ్డి, సుష్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బషీరాబాద్/కొడంగల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలని నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి సూచించారు. బషీరాబాద్‌లోని సొసైటీ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. అదేవిధంగా కొడంగల్ పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో చైర్మన్ కటకం శివకుమార్‌గుప్త ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

దోమ: రంగంపల్లికి చెందిన ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్ ఆనంద్‌రావుపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అక్రమ రిజిస్ట్రేషన్‌తో పాటు అదే గ్రామంలో 20-30 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టడం, గోవిందాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నం.95లో 16ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సీహెచ్.సత్తయ్య, చెన్నారెడ్డి, చీమ వెంకటేశ్, రాములు, ఆనంద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

బషీరాబాద్: మైల్వార్‌లో నీటి సమస్యపై స్థానిక నాయకులు సతీష్, నరేందర్ ఇటీవల ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.2 లక్షల నిధులు మంజూరు చేయగా ఆదివారం సాయంత్రం ట్యాంకు సమీపంలో కొత్తగా బోరు వేశామన్నారు.

బీజేపీ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలి

పరిగి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ళుగా పూర్తి చేసిన సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద శక్తి కేంద్రంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, శక్తి కేంద్రప్రముఖ్ కోళ్ళ నర్సింహ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

బషీరాబాద్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద సోమవారం విద్యాధికారి దూస రాములు ఆయా పాఠశాలలకు సంబంధించిన నోట్ బుక్స్‌ను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

క్రైం కార్నర్

భూతగాదాలో వ్యక్తి మృతి

దౌల్తాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల్లో వ్యక్తి మృతిచెందిన ఘటన దౌల్తాబాద్ మండలంలో జరిగింది. కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండివాడ తండా, హన్మానాయక్ తండాల పొలాలకు వెళ్లేబాట విషయంలో 30ఏళ్లుగా ఇరువర్గాల మధ్య భూతగాదాలు ఉన్నాయి. ఆదివారం రాత్రి ఇరువర్గాలు రాడ్లు, కట్టెలతో పరస్పరం దాడిచేసుకున్నారు. ఈ ఘటనలో బండివాడ తండాకు చెందిన చౌహన్ వెంకట్‌నాయక్(38)కు తీవ్రగాయాలు కావడంతో కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడు చౌహన్ వెంకట్‌నాయక్ సోదరుడు చౌహన్ బాబునాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొని యువకుడు..

కీసర రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా జియాపల్లికి చెందిన కళ్యాణ్(20) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన మిత్రుడు తరుణ్‌తో కలిసి పని మీద బైక్‌పై ఈసీఐఎల్‌కు వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో కీసర టౌన్‌లోని పెంతెకోస్తు చర్చి సమీపానికి చేరుకున్నారు. ఈ క్రమంలో కీసర నుంచి ఈసీఐఎల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వెళ్లి తమ బైక్‌తో బలంగా ఢీకొట్టారు. దీంతో తీవ్రగాయాలపాలైన కళ్యాణ్ ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. తరుణ్‌తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కళాశాల బస్సు ఢీకొని మరొకరు..

ఉప్పల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కళాశాల బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్యానగర్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్, పరిగికి చెందిన చింతకింది సంపత్(25) ఉప్పల్‌లోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు నాగోల్‌లోని జైపురి కాలనీలోని సోదరి ఇంట్లో ఆశ్రయం పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తన సోదరుడితో కలిసి నాగోల్ నుంచి బైక్‌పై ఉప్పల్ భగాయత్ మీదుగా ఏషియన్ థియేటర్‌కి వచ్చే రోడ్డుమీదుగా వెళ్తుండగా, సత్యానగర్‌లో కేశవ్ మెమోరియల్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొట్టింది. వెనక చక్రాలు అతడి శరీరంపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన సంపత్‌ను స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సంపత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ..

దుద్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న దుద్యాల గేటు సమీపంలో స్కూటీని లారీ ఢీకొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత మృతి చెందింది. ఈ ఘటనలో కూతురు అక్షిత అక్కడికక్కడే మృతి చెందగా భార్యాభర్తలు అనిత, వెంకటేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య అనితను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఆమె మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా భర్త వెంకటేశ్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రమాదవశాత్తు వృద్ధుడు..

కొడంగల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన కొడంగల్ మండలంలో జరిగింది. రుద్రారం గ్రామానికి చెందిన హజ్రత్‌అలీ(60) సోమవారం పనినిమిత్తం ఆటోలో కొడంగల్‌కు వస్తున్నాడు. డ్రైవర్ పక్కనే కూర్చున్న హజ్రత్‌అలీ చిట్లపల్లి టోల్‌ప్లాజా వద్ద స్పీడ్‌బ్రేకర్ దాటే క్రమంలో అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే హజ్రత్‌అలీని కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

'పోలీసులు పట్టించుకోవడం లేదు'

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వాహనాలు పోయాయని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని, వాహనాలు ఎవరూ దొంగలించారో పట్టుకోవాలని బాధితులు కోరారు. సోమవారం ఎస్పీ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మర్పల్లి మండలం పంచలింగాల గ్రామానికి చెందిన బాధితుడు అప్పలి ప్రభాకర్ జూన్ 13న తన ఇంటి వద్ద ఉంచిన యూనికాన్ తో పాటు హుండా షైనింగ్ వాహనాన్ని గ్రామాన్ని దొంగలించారన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాని వారు కోరారు. ఎస్పీని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ యాదవ్, నాయకులు మొగులయ్య, బూర్గుపల్లి రమేష్, రావులపల్లి మల్లారెడ్డిలు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు

కులకచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూర్ చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ అన్నారు.రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి నిధులతో బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో విజయేందర్‌రెడ్డి, మోనాచారి, నరేశ్, రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.